

వృద్ధురాలి దారుణ హత్య

ఒంటరిగా నివశిస్తున్న వృద్ధురాలి మెడలో బంగారు నగలను దోచుకున్న దొంగలు ఆమెను హతమార్చిన ఘటన ఒంగోలు మండలం ఉలిచిలో జరిగింది.

- 8లో..



సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందాం

గ్రామాల్లో సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే తాటిపర్తి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37.9/30.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

అమాంతం పెరిగిన పొగాకు ధర

- పొగాకు ధర గరిష్టంగా రూ.343

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరిధిలో పొగాకు ధరలు బుధవారం అమాంతం పెరిగాయి. మంగళవారంతో పోలిస్తే రూ.9 పెరిగి గరిష్టంగా రూ.343 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో బుధవారం 10,127 బేళ్లు రాగా, 9325 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 802 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 84వ రోజు వేలం పాట జరుగుతోంది. అందులో 4500 బేళ్లు రాగా, 4227 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 273 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. కేజీ గరిష్టంగా రూ.343, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.292.99 వచ్చింది. అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు–2, ఒంగోలు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 79వ రోజు వేలం పాటలు జరుగుతున్నాయి. ఆయా కేంద్రాల్లో 5627 బేళ్లు రాగా, 5098 బేళ్లు కొనుగోలయ్యాయని, 529 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.341, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.256.99 వచ్చినట్లు వివరించారు.

23న జిల్లాస్థాయి హాకీ జట్టు ఎంపిక

చీమకుర్తి: జిల్లా స్థాయి హాకీ సీనియర్ పురుషుల జట్టును ఈ నెల 23న సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో ఎంపిక చేయనున్నట్లు హాకీ జట్టు జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 27 నుంచి 30 వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు ఆధార్, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాలను తీసుకొని 23న జరిగే ఎంపికకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9666067764 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



మేతకు వెళ్తున్న జీవాలు

తొలకరి కాలం.. వ్యాధుల గాలం

తొలకరి చినుకులు పడుతున్నాయంటేనే పాడి రైతులు గజగజలాడాల్సి వస్తుంది. జీవాలు, పాడి పశువులు ఈ సీజన్‌లో ఎక్కువగా వ్యాధులబారిన పడుతుంటాయి. పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించి టీకాలు వేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల నివారణకు అవకాశం ఉంది. పశువులు, జీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేసేందుకు పశుసంవర్ధక శాఖ వ్యాక్సినేషన్ చేపట్టింది.

- చిటుకలో ముంచుకొచ్చే ముప్పు
- జీవాలకు వ్యాధి సోకితే క్షణాల్లోనే మృత్యువాత
- వ్యాధి ప్రబలకుండా పశుసంవర్ధక శాఖ ముందస్తు చర్యలు
- చిటుకు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్
- అందుబాటులో ఈటీ వ్యాక్సిన్ 11.10 లక్షల డోసులు, బీటీ వ్యాక్సిన్ 27.81 వేల డోస్‌లు
- ఈనెల 30 వరకు వ్యాక్సినేషన్

ఒంగోలు సెంట్రల్: ప్రస్తుతం తొలకరి వానలు కురుస్తుండటంతో పశువులకు, జీవాలకు సోకే వ్యాధులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సాగులో నష్టం వచ్చినా, కరువు కమ్ముకొచ్చినా కలిగే లోటును పాడిపరిశ్రమ, జీవాల పెంపకంతో పూడ్చుకుని జీవనం సాగిస్తున్నారు. అలాంటి ప్రధాన ఆధారమైన పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు, చిటుకు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తొలకరి సమయంలోనే అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గటంతో పాటు పశువులు మరణించే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నీరు, మేత కారణంగా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గి పలు వ్యాధులు సంక్రమిస్తాయి. జిల్లాలో తెల్ల పశువులు 56,332, నల్ల పశువులు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589 ఉన్నాయి.



బేస్తవారి పేటలో మేకలకు వేస్తున్న వ్యాక్సిన్

చిటుకు వ్యాధి..

గొర్రెల్లో వచ్చే వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైంది. చిటుక వ్యాధికి గురైన గొర్రెలు చిటుక వేసినంత సమయంలోనే మృత్యువాత పడతాయి. క్లాస్ట్రీడియం పర్ఫింజన్స్ టైప్–డి అనే బ్యాక్టీరియా వల్ల గొర్రెల్లో చిటుక వ్యాధి వస్తుంది. ఈ క్రిములు జీవాల పొట్టలో సహజీవనం చేస్తుంటాయి. అయితే తేమతో కూడిన పచ్చగడ్డిని గొర్రెలు తిన్నప్పుడు ఈ సూక్ష్మ క్రిములు ఆ గడ్డితోని ధాతువులను జీర్ణం చేసుకుని వృద్ధి చెంది క్రమంగా వాటి సంతతిని పెంచుకుంటాయి. ఈ తర్వాత జీవాల పేగుల్లో హానికరమైన 'ఎప్సిలాన్ టాక్సిన్' అనే విష పదార్థాన్ని విడుదల చేయటం మొదలు పెడతాయి. ఇది పేగులు, మూత్ర పిండాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. జీవాల్లో ఎప్సిలాన్ విషపదార్థం ఎక్కువైతే అవి వెంటనే చనిపోతాయి. కొన్ని గొర్రె పిల్లలు చెంగున గాలిలోకి ఎగిరిపడి మరణిస్తాయి. పెద్ద గొర్రెలు తీవ్రమైన అనారోగ్యంతో సరిగ్గా నడవలేక మేత తినక, నోటి నుంచి చొంగ కారుతుంది.పండ్లు కొరుకుతూ బిగుసుకుని చనిపోతాయి.



అందుబాటులో వ్యాక్సిన్

ఈ సీజన్‌లో గొర్రెలు, మేకల్లో చిటుకు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన జీవాలు క్షణాల్లో మృత్యువాత పడతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని చిటుకు వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యాక్సినేషన్ చేపట్టాం. ఈటీ వ్యాక్సిన్ 11.10 లక్షల డోసులు, బీక్యూ వ్యాక్సిన్ 27,810 డోసులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు 8.36 లక్షల ఈటీ, 22 వేల బీక్యూ డోస్ అందించాం. తెల్లజాతి పశువులు, జీవాల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. జూన్ 30 వరకు వ్యాక్సిన్‌లు వేస్తారు. జీవాల పెంపకందార్లు తమ జీవాలకు వ్యాక్సిన్ వేయించుకోవాలి.

– షేక్ కాలేషా, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, ఒంగోలు

ఈటీ, బీక్యూ వ్యాక్సిన్ లక్ష్యం

డివిజన్ పేరు	ఈటీ వ్యాక్సిన్		బీక్యూ వ్యాక్సిన్	
	లక్ష్యం	నమోదు	లక్ష్యం	నమోదు
ఒంగోలు	3,82,521	3,05,703	3,600	3,898
మార్కాపురం	7,27,604	5,30,707	24,210	18,620
మొత్తం	**11,10,125**	**8,36,410**	**27,810**	**22,518**

గాలికుంటు వ్యాధి

కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లిపాల నుంచి దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో గేదెలు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి. ఆయా వ్యాధుల నుంచి ముందస్తు రక్షణ కోసం చిటుకు వ్యాధి నివారణకు ఈటీ వ్యాక్సిన్, బ్లాక్ క్వార్టర్ వ్యాక్సిన్ (బిక్యూ) (జబ్బవాపు) ఆవులకు జిల్లాలో పశుసంవర్ధక శాఖ మే 15 నుంచి అందిస్తోంది. జూన్ 30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.



పీసీ పల్లి మండలం నేరేడుపల్లిలో వ్యాక్సిన్ వేయిస్తున్న మహిళ

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో ప్రధానంగా గొంతు వాపు వ్యాధి సోకుతుంది. దీన్నే గురక వ్యాధి అని కూడా అంటారు. గేదెలు, ఆవులు, దూడలలో ఈ వ్యాధి కనిపిస్తుంది. ఈ వ్యాధి మూడు రకాలుగా ఉంటుంది. పర్ ఆక్యూట్, ఆక్యూట్, క్రానిక్, పశువుల్లో తీవ్రమైన జ్వరం (106,107 ఎఫ్) ఉండటం, రెండు కళ్లు ఎర్రబడి నీరు కారడం, నోటి వెంట సొంగ కారటం, గొంతు కింది భాగంలో నొప్పితో కూడిన వాపు కలిగి ఉంటుంది. ముందరి కాళ్లు వాపు రావటం, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరటం, శ్వాస కష్టమై ఊపిరి ఆడకుండా ఉండిపోవటం, ఆయాస పడటం తదితర లక్షణాలు కనిపిస్తాయి. పశుపోషకులు వెంటనే గుర్తించి చికిత్స చేయించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊపిరాడక గురకతో పశువు 48 గంటల్లో చనిపోయే పరిస్థితి ఉంటుంది.

జిల్లా కాంక్ష తీరేనా..

- మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ
- హామీ నెరవేర్చాలని కోరుతున్న పశ్చిమ ప్రాంత ప్రజలు

మార్కాపురం:

మార్కాపురం జిల్లా ఏర్పాటుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో టీడీపీ అధికారంలోకి వస్తే మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి ప్రాంతాలను కలుపుతూ జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు కందుకూరు, అద్దంకి ప్రాంతాలను ఒంగోలులో కలుపుతామని నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాడవంతో వారం రోజులుగా పశ్చిమ ప్రాంత ప్రజలు మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఆశతో ఎదురు చూస్తున్నారు. ఏ నలుగురు కలిసినా మార్కాపురం జిల్లా ఏర్పాటుపై చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా ఏర్పాటుపై ప్రకటన చేస్తారని రోజూ ఎదురుచూస్తున్నారు. త్వరలో జరగబోయే క్యాబినెట్‌లో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై తీర్మానం జరుగుతుందా లేదా ? అన్న అంశంపై కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇచ్చిన హామీ మేరకు జిల్లా ఏర్పాటుపై గెలిచిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావిస్తేనే జిల్లా ఏర్పాటు అంశం తెరపైకి వస్తుంది.

అన్నీ అర్హతలు:

పశ్చిమ ప్రకాశం ముఖ్యకేంద్రమైన మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసేందుకు అన్నీ అర్హతలు ఉన్నాయి. మార్కాపురంలోనే సబ్‌కలెక్టర్, డీఎస్పీతోపాటు గతంలో అదనపు ఎస్పీ స్థాయి అధికారిని ఓఎస్డీగా నియమించారు. మార్కాపురంలో జిల్లా ఆరో అదనపు కోర్టు, ఆకాశవాణి కేంద్రం, సెబ్ కార్యాలయాలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్టీ కార్యాలయాలు ఉన్నాయి.



మార్కాపురం పట్టణం వ్యూ

మార్కాపురం రైల్వేస్టేషన్ రోడ్, మెడికల్ కాలేజీ, జీజీహెచ్, వీటితో పాటు నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ తదితర విద్యాసంస్థలు కూడా ఉన్నాయి. జిల్లా కేంద్రం ఏర్పాటైతే వెనుకబడిన పశ్చిమ ప్రకాశం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ప్రత్యేక నిధులు:

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే కేంద్ర ప్రభుత్వం నుంచి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి వచ్చే నిధులు మార్కాపురానికి వస్తాయి. దీని వలన మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్, ఎస్పీ, వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, డీఆర్‌డీఏ, డ్వామా తదితర శాఖల ఉన్నతాధికారులు ఇక్కడే ఉండి అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలిస్తారు. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లాలంటే పుల్లలచెరువు నుంచి ఒంగోలుకు 170 కిలోమీటర్లు, గిద్దలూరు నుంచి ఒంగోలుకు 150 కిలోమీటర్లు, దోర్నాల నుంచి ఒంగోలుకు 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ ప్రజలు ఒంగోలుకు వెళ్లాలంటే అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే అధికార వికేంద్రీకరణతోపాటు అభివృద్ధి కూడా త్వరగా జరిగే అవకాశం ఉంది.


త్వరగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి



పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరిక అయిన మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్కాపురం వచ్చినప్పుడు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశంలో తీర్మానం పెట్టి జిల్లా ఏర్పాటు చేయాలి.

– జావీద్ అన్వర్, కాంగ్రెస్‌పార్టీ, న్యాయవాది

హామీ నిలబెట్టుకోవాలి



ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్‌లో మార్కాపురం, పొదిలి వచ్చినప్పుడు ప్రజలకు మార్కాపురాన్ని జిల్లా చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే అమలు చేసి జిల్లాను ఏర్పాటు చేయాలి. దీనివలన కరువు ప్రాంతమైన పశ్చిమ ప్రకాశానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అదనంగా నిధులు వచ్చి మార్కాపురం అభివృద్ధి చెందుతుంది.

– రఫీ, సీపీఎం కార్యదర్శి

దాడులు చేస్తే సహించం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

- కార్యకర్తలకు అండగా ఉంటా
- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ టీడీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమన్నారు. తాము ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు. కానీ రాష్ట్ర మంత్రులు అధికారాన్ని కక్ష సాధింపు చర్యలకు, పగలకు, రాగద్వేషాలకు, వారి స్వార్థ ప్రయోజనాలకు, ఆస్తులను కాపాడుకోవటానికి, వారి సామాజిక వర్గాన్ని బలోపేతం చేయటానికి ఉపయోగించటం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. తమ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల ప్రవర్తన చాలా దారుణంగా ఉందన్నారు. ముఖ్యంగా టంగుటూరు మండలం నాయుడుపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం, కొండపి మండలం పెట్లూరులో పట్టా భూమిని ఆక్రమించుకోవటం, పెద్దకల్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యం పంతులు ఇంటిని కూల్చివేయటం, ఉళ్లపాలెంలో గోడ తగాదా, మర్రిపూడి మండలంలో దాడులు కానివ్వండి మనం ప్రజాస్వామ్యం వ్యవస్థలో ఉన్నామా లేక రాజరిక పాలనలో ఉన్నామా అని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద కళ్లగుంట ఘటనలో మనుషులను ఎవ్వరినీ రానివ్వకుండా పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని జేసీబీ సహాయంతో సర్పంచ్ ఇంటిని కూలగొట్టే దుశ్చర్యలను సాగించారన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభించి తెల్లవారుజామున 4 గంటల వరకు ఇంటిని కూలగొట్టి భవనాల శకలాలు ఒక్కటి కూడా ఆ స్థలంలో లేకుండా జేసీబీ సహకారంతో తొలగించారని, దీనిపై ఎస్సై, సీఐ, డీఎస్పీ, ఎస్పీకి చెప్పినప్పటికీ వారు చూద్దాం, చేద్దాం అంటున్నారే తప్ప ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలు కాపాడే పోలీసు వ్యవస్థ వారికి దాసోహమనడం చాలా దుర్మార్గమని, ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమన్నారు. సామాన్య మానవుడు జీవించే పరిస్థితి లేదని,



పట్టా వెనక్కు తీసుకోవాలని కలెక్టరుకు మంత్రి రాసిన లేఖ



సర్పంచ్ స్థలానికి గతంలో ఇచ్చిన పట్టా

ఇది మంచి పద్ధతి కాదని.. దీనికి తగిన ప్రతిఫలం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అధికార దాహంతో టీడీపీ నాయకులు విర్రవీగుతున్నారని, అడ్డూ అదుపు లేకుండా చేస్తున్న మారణహోమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ప్రభుత్వ పరిపాలనలో భాగస్వాములైన మంత్రులు కూడా వారి క్యాడర్‌ను రెచ్చగొడుతూ మీరు ఏమైనా చేయండి మీకు అడ్డులేదని చెబుతున్నారన్నారు. అధికారులను కూడా లొంగదీసుకుని మీకు పచ్చబిళ్ల ఇస్తాం అధికారులు మీకు కుర్చీ వేయ్యాల, కాఫీ ఇయ్యాల, మీరు చెప్పిన పని చెయ్యాల, లేకపోతే వారి సంగతి తేలుస్తామని హెచ్చరిస్తున్నారని ఇది గమనించి సుమోటోగా ప్రజావ్యాజ్యం కింద కోర్టులు చొరవ తీసుకుని మంత్రి అచ్చెం నాయుడు మీద, కార్యకర్తలను రెచ్చగొట్టి హింసను ప్రేరేపించే వారందరి మీద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి స్వామి తెరచాటున ఉండి కార్యకర్తలను రెచ్చగొట్టి హింసా రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి స్వామి తనకు ఇచ్చిన పదవితో పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు చేయాలి..వారి ఆస్తులను కాపాడాల్సింది పోయి తను మంత్రి అయిన తరువాత మొట్టమొదటి లేఖను అన్నిరకాల పట్టా పత్రాలు ఉన్నప్పటికీ సదరు ఇంటి స్థలాన్ని లాక్కోవాలని కలెక్టరుకు రాయటాన్ని సురేష్ ఆక్షేపించారు. ఈ విధంగా దౌర్జన్యకాండ సాగించడం మంచి పద్ధతి కాదన్నారు. మా కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులపై దాడులు కానీ, వారి ఆస్తుల ధ్వంసం కానీ చేస్తుంటే ఊరుకోమని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తలు చేసే పాపాలు లెక్కపెడుతున్నామని శిశుపాలుడి శాపాలుగా మారి పాపం పండిన రోజున తగిన మూల్యం చెల్లిస్తారని విమర్శించారు. నేను కార్యకర్తలకు అండగా ఉంటా, కార్యకర్తల సంక్షేమమే నాధ్యేయం అని మాజీ మంత్రి సురేష్ అన్నారు.

కరువు నష్టం అంచనాల నివేదిక సిద్ధం చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో కరువును అంచనా వేసేందుకు వస్తున్న కేంద్ర బృందానికి సమగ్రంగా నష్టం వివరాలు అందించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి నేడు జిల్లాకు వస్తున్న కేంద్ర బృందం పర్యటనపై చర్చించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ నుంచి మార్చి వరకు మెట్ట ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టం, రిజర్వాయర్లు, చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం వంటి అంశాలకు సంబంధించి క్షుణ్ణంగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. పంట నష్టాలపై ఫొటో ఎగ్జిబిషన్, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బృందానికి వివరించాలన్నారు. జిల్లాలో మొత్తం 38 మండలాల్లో 31 మండలాలు కరువు మండలాలుగా గుర్తించినట్లు తెలిపారు. వాటిలో యర్రగొండపాలెం, దోర్నాల, కురిచేడు, ముండ్లమూరు, దర్శి, పొదిలి, మర్రిపూడి, పెద్దారవీడు, మార్కాపురం, కంభం, తర్లుపాడు, హెచ్ఎంపాడు, వెలిగండ్ల, పెదచెర్లోపల్లి, సీఎస్‌పురం, పామూరు, ఎస్ఎన్ పాడు, ఒంగోలు, కొత్తపట్నం, పుల్లలచెరువు మండలాలను తీవ్రమైన కరువు మండలాలుగా గుర్తించగా దొనకొండ, కొనకనమిట్ల, అర్ధవీడు, బేస్తవారిపేట, రాచర్ల, గిద్దలూరు, కొమరోలు, కనిగిరి, ఎస్‌జీపాడు, చీమకుర్తి, కొండపి మండలాలను మోస్తరు కరువు మండలాలుగా గుర్తించినట్లు చెప్పారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, సీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ మాధురి, పశు సంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డ్వామా పీడీ అర్జున్‌రావు, ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, ఎల్‌డీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కరువు నష్టం అంచనాలపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జిల్లాను అన్నీ విధాలుగా అభివృద్ధి చేస్తాం



జిల్లా స్థాయి అధికారుల పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

- జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమంలో మంత్రి డోలా

ఒంగోలు అర్బన్: అభివృద్ధి, సంక్షేమం రెండింటికి ప్రాధాన్యం ఇస్తూ జిల్లాను అన్నీ విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. బుధవారం స్పందన హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి అధికారుల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రిని కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆహ్వానించారు. మంత్రితో పాటు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, విజయ్‌కుమార్, కె నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దీనిలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో తాగు, సాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పనిచేస్తామన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. ఈ విషయంలో సచివాలయాలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మురుగు కాలువలను నిరంతరం శుభ్రపరచాలని సూచించారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, ఏఎస్పీ నాగేశ్వరరావు, సీపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ప్రాజెక్టు ఎస్ఈ అబుతలీమ్, సాంఘీక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మార్కాపురంలో కరువు బృందం పర్యటన

మార్కాపురం: మార్కాపురం సబ్ డివిజన్‌కు సంబంధించి గురువారం కేంద్ర కరువు బృందం మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించనున్నట్లు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.బాలాజీ నాయక్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర కరువు బృందం పోతలపాడు, గానుగపెంట గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు మార్కాపురం మండలం వేములకోటలోని ఎంఐ ట్యాంకును పరిశీలిస్తారని, ఆ తరువాత పెద్దారవీడు మండలంలోని గొబ్బూరులో పీఆర్ ట్యాంకును కేంద్ర బృందం పరిశీలిస్తుందన్నారు. ఈ బృందంలో ఎంఐఎంఏ డ్ఏ డైరెక్టర్ మన్నుజీ ఉపాధ్యాయ, కేంద్ర పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌ఈ కశ్యప్, న్యూఢిల్లీకి చెందిన ఫుడ్‌అండ్ పబ్లిక్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ మధన్‌మోహన్ మౌర్య, నీతిఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనూరాధ బటాన్‌తో పాటు స్థానిక అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులు ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను వివరించాలని కోరారు.

ప్రజల మన్ననలు పొందేలా బాధ్యతలు నిర్వహించాలి

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



ఎస్సైగా పదోన్నతి పొందిన కృష్ణయ్యను అభినందిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: నిజాయితీ, నిబద్ధతగా విధులు నిర్వహించడం ద్వారా ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన జి. కృష్ణయ్య బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను అభినందించిన ఎస్పీ మాట్లాడుతూ పిన్న వయసులో పదోన్నతి పొందడం చాలా గర్వకారణమన్నారు. పదోన్నతి అనేది మరింత బాధ్యత పెంచుతుందని, అందుకు తగినట్లు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పోలీసు శాఖ గౌరవం, ప్రతిష్ట పెరిగేలా బాధ్యతలు నిర్వహించాలని, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందాలని కోరారు.

వృద్ధురాలి దారుణ హత్య

బంగారు ఆభరణాల కోసం దుండగుల ఘాతుకం ● ఒంగోలు మండలం ఉలిచిలో ఘటన

ఒంగోలు టౌన్: ఒంటరిగా నివశిస్తున్న ఒక వృద్ధురాలి మెడలోని బంగారం నగలను దోచుకొన్న దొంగలు ఆమెను హతమార్చడం సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం ...ఒంగోలు మండలంలో ఉలిచి గ్రామంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో యర్రంనేని సీతారావమ్మ (80) ఒంటరిగా నివశిస్తుంటారు. భర్త వెంకటేశ్వర్లు పదేళ్ల క్రితమే మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా వారంతా అదే గ్రామంలో వేరుగా నివశిస్తున్నారు. అయితే మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఆమె ఎదురింటి వారితో మాట్లాడినట్లు సమాచారం. రాత్రి నిద్రపోయిన తరువాత అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమెకు శ్వాస ఆడకుండా చేసి మెడలోని బంగారు నగలు, చేతి గాజులు దోచుకున్నారు. అందుకు గుర్తుగా సీతారావమ్మ ముక్కు మీద గాయాలున్నాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం ఉదయం ఎదురింటి వాళ్లు ఇంట్లోకి వెళ్లి నిద్ర లేపేందుకు ప్రయత్నించగా ఎంతకూ పలకక పోవడంతో అనుమానం వచ్చి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సీతారావమ్మ కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలిసిన వెంటనే అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, ఒంగోలు డీఎస్పీ కిశోర్ బాబు సంఘటనా స్థలానికి చేరుకొని సాక్ష్యాధారాలు సేకరించారు. పోలీసు డాగ్‌ను కూడా రంగంలోకి దించారు. పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. టూ టౌన్ సీఐ జగదీష్ విచారణ చేస్తున్నారు.

వరస ఘటనలతో భయాందోళనలు.

ఇటీవల వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతుండడం భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొత్తపట్నంలో ఒక వృద్ధురాలిని హతమార్చిన దొంగలు ఆమె మెడలోని బంగారు నగలను దోచుకెళ్లారు. ఒంగోలులోని అంబేద్కర్ భవనం ఎదురుగా ఇందిరా కాలనీలో కూడా ఒంటరిగా నివశిస్తున్న వృద్ధురాలిని ఊపిరాడకుండా చేసి ఆమె వద్ద ఉన్న బంగారు నగలను దోచుకెళ్లారు. ఈ ఘటనలో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

ఇప్పుడు ఉలిచిలో కూడా ఒంటరిగా నివశిస్తున్న వృద్ధురాలిని ఊపిరాడకుండా చేసి ఒంటిపై ఉన్న బంగారు నగలు, చేతిలోని గాజులను దోచుకున్నారు. ఈ ఘటనలన్నీ ఒకే తరహాలో జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది.


దొంగల దాడిలో మృతి చెందిన సీతారావమ్మ

వైఎస్ జగన్‌ను కలిసిన బొట్ల రామారావు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బొట్ల రామారావు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర బీసీ విభాగం జోన్–5 ఇన్‌చార్జి బొట్ల రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ ఓటమి, ప్రకాశం జిల్లాలో నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడుల గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ జీరో నుంచి మొదలైందని, 40 శాతం ఓటర్లు పార్టీ వైపు ఉన్నారని, కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారని బొట్ల రామారావు వివరించారు.

శిశుగృహ చిన్నారుల దత్తత

- బ్రెజిల్, బెంగళూరు దంపతులకు అప్పగించిన కలెక్టర్ దినేష్‌కుమార్


శిశుగృహలోని బాబును దత్తత తీసుకుంటున్న బ్రెజిల్‌కు చెందిన దంపతులు

ఒంగోలు అర్బన్: శిశు గృహలో ఉంటున్న చిన్నారులను ఇద్దరు దంపతులు బుధవారం దత్తత ప్రక్రియను ముగించుకుని కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా చిన్నారులను తీసుకున్నారు. బ్రెజిల్‌కు చెందిన దంపతులు జర్గన్ అల్బర్ట్ రోజియర్, కరెన్ డివిట్, బెంగళూరుకు చెందిన డాక్టర్ మహేష్, భవ్య దంపతులు ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్నారు. ఆ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్ ఇద్దరు దంపతులకు దత్తత ధ్రువీకరణ పత్రంతో పాటు చిన్నారులను అందచేశారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అధికారి మాధురి, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, బాలల సంరక్షణ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందాం

- కార్యకర్తలు సంయమనం పాటించాలి
- అధికారం ఉందని రెచ్చిపోవడం సరైన పద్ధతి కాదు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: గ్రామాల్లో ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని, ఎటువంటి సందర్భంలోనైనా ప్రత్యర్థులు రెచ్చగొట్టినా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కొలుకుల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఉందని టీడీపీ నాయకులు అనవసరంగా రెచ్చిపోతున్నారని, అధికారులను సైతం వారు వదలడం లేదని, తమ పార్టీ నిజస్వరూపం ఏమిటో మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు మాటల్లోనే తెలుస్తుందన్నారు. గత ఐదేళ్ల జగనన్న పాలనలో ఇటువంటి సంఘటనలు జరగలేదని, కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు మంచి గౌరవం ఉండేదని తెలిపారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సింది పోయి అధికారం ఉందని తమ కార్యకర్తలను రెచ్చకొట్టుకుంటూ తిరగడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై ఎక్కువగా దృష్టి పెట్టాలని, ఆ సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, తాను అన్ని సమయాల్లో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.మజీద్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ చల్లా ఎల్లారెడ్డి, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, వెన్నా మోహన్‌రెడ్డి, బి.బాలచెన్నయ్య, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చైన్ దొంగలు దొరికారు

ఒంగోలు టౌన్: నగరంలోని ఒక ఫంక్షన్ హాలులో చిన్నారి బాలుడి మెడలో బంగారు నగలు అపహరించిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..కొండపి మండలంలోని వెన్నూరు గ్రామానికి చెందిన పోకూరి వంశీకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 16వ తేదీ ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో బంధువులకు సంబంధించిన శుభకార్యానికి వచ్చాడు. వంశీకృష్ణ చిన్న కుమారుడైన ఏడేళ్ల బాలుడు జయవర్ధన్ అక్కడ ఆడుకుంటుండగా తాళ్లూరు మండలం శివరాంపురం గ్రామానికి చెందిన రావిపాటి జగదీష్, తూర్పు గంగవరం గ్రామానికి చెందిన పుట్ట శ్రీనివాసులు చిన్నారిని మాయమాటలతో డాబా మీదకు తీసుకెళ్లారు. బెదిరించి, కొట్టి అతడి మెడలోని 2 సవర్ల బంగారు చైను, 2 సవర్ల బ్రాస్‌లెట్, 6 గ్రాముల ఉంగరాలు దొంగిలించుకొని మాయమయ్యారు. ఈ కేసులో ఎస్పీ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు సూచనల మేరకు డీఎస్పీ కిశోర్ బాబు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఒంగోలు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న రావిపాటి జగదీష్, పుట్ట శ్రీనివాసులును అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన స్పెషల్ టీం సీఐ జగదీష్, ఎస్ఐ శివప్రసాదరావు, ఏఎస్ఐ కె. సురేష్, హెచ్‌సి జి.విజయ్, కానిస్టేబుళ్లు అనిల్ ,తిరుపతయ్యలను ఎస్పీ అభినందించారు.

బంగినపల్లె టన్ను రూ.90 వేలు

ఉలవపాడు: ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఉలవపాడు బంగినపల్లె మామిడి రకం గత పదేళ్లలో తొలిసారిగా టన్ను రూ.90 వేలు పలికింది. గత రెండు రోజులుగా వ్యాపారులు టన్ను రూ.80 వేల నుంచి రూ.90 వేల మధ్య ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది కాపు తక్కువగా ఉండడంతో కాయల రేట్లు అధికంగా పలికాయి. కాయల్లో పురుగు లేకపోవడంతోపాటు నాణ్యత బాగుండడంతో కాయల ధరలు పలికాయి. హైదరాబాద్, ముంబాయి, కలకత్తా నుంచి వ్యాపారులు అధికంగా మామిడి కాయల కోసం రావడంతో కాయలకు డిమాండ్ ఏర్పడింది. తోటల్లో కాయలను మొత్తం దులిపివేసి ఎగుమతులు చేస్తున్నారు. కవర్ కట్టిన కాయలకు అయితే రూ.లక్ష పైనే పలుకుతుండగా ఆ కాయలు ప్రస్తుతం అయిపోయాయి. కవర్ కట్టని సాధారణ బంగినపల్లె రకం మామిడి ప్రస్తుతం రూ.90 వేలు పలుకుతుండడం విశేషం. గత పదేళ్లలో గరిష్టగా రూ.50 వేలు పలికిన మామిడి ఈ ఏడాది మాత్రం రూ.90 వేలు పలికింది.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: నగరంలోని రూడ్‌సెట్ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఈ నెల 25 నుంచి బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి. ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మహిళలు, యువతులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. అలాగే 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగి ఉండి ఆధార్ కార్డు, రేషన్ కార్డులను కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9492583484 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రూ.5.69 లక్షల మోసంపై కేసు నమోదు

మార్కాపురం టౌన్: ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి సంస్థ డబ్బును బ్యాంకులో జమ చేయకుండా సొంత అవసరాలకు ఉపయోగించుకోవడంపై కేసు నమోదైంది. సదరు కంపెనీ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ బుధవారం తెలిపారు. వివరాలు.. స్థానిక సాధన కళాశాల రోడ్‌లోని ఒక ప్రైవేట్ కొరియర్ సంస్థలో మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామానికి చెందిన ఎస్.సురేష్‌బాబు పనిచేస్తున్నాడు. కొరియర్ బిల్లులను రోజూ స్థానిక యాక్సిస్ బ్యాంకులో జమ చేయాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా బ్యాంకులో డబ్బు జమ కావడం లేదని మేనేజర్ రవితేజ గుర్తించారు. ఈ మేరకు బ్యాంకుకు వెళ్లి విచారించగా డబ్బు జమ కావడం లేదని నిర్ధారణ అయింది. ఆ నగదును సురేష్ తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నాడని తెలుసుకుని ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు తీవ్ర గాయాలు

- మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలింపు


విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన సురేష్ నాయక్

రాచర్ల: విధి నిర్వహణలో ఉన్న లైన్‌మన్(సచివాలయం జేఎల్‌ఎం) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన సంఘటన రాచర్ల మండలంలోని పాలకవీడు చెరువు పక్కనే వ్యవసాయ పొలాల్లో బుధవారం ఉదయం 7:30 సమయంలో చోటుచేసుకుంది. వివరాలు.. అర్ధవీడు మండలం పోతురాజుటూరు గ్రామానికి చెందిన రాత్లావత్ సురేష్ నాయక్ రాచర్ల మండలంలోని అనుమలవీడు గ్రామ సచివాయంలో జేఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. పాలకవీడు చెరువు సమీపంలోని ఒద్దులవాగుపల్లె గ్రామానికి చెందిన వ్యవసాయ పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేసేందుకు బుధవారం ఉదయం 7:30 గంటలకు వెళ్లాడు. ఒద్దులవాగుపల్లె గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌కు ఎల్‌సీ ఇవ్వాలని అనుమలవీడు సబ్‌స్టేషన్ ఆపరేటర్ సురేష్‌కు ఫోన్ చేశారు. అనంతరం సురేష్ ఒద్దులవాగుపల్లె లైన్‌కు ఎల్‌సీ ఇచ్చినట్లు సమాచారం ఇవ్వడంతో సురేష్ నాయక్ పనులు చేసేందుకు స్తంభం ఎక్కాడు. ఎల్‌సీ ఇచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోకపోవడంతో విద్యుదాఘాతానికి గురై కుడి చేయి, కుడి కాలు పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్ స్తంభం పైనుంచి కిందపడిన సురేష్ నాయక్‌ను అక్కడే ఉన్న రైతులు హుటాహుటిన 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల, ఆ తర్వాత కర్నూలు తరలించారు. ఎల్‌సీ ఇవ్వడంలో తప్పిదం వల్లే ప్రమాదం జరిగిందని రైతులు చర్చించుకుంటున్నారు.


సికిల్ సెల్ ఎనీమియాపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డీ సురేష్
- వైద్య, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహణ
- జిల్లాలో 1,05,596 మంది ట్రైబల్ జనాభాలో 16,372 మందికి పరీక్షల నిర్వహణ
- 12 మందికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఉన్నట్లు ధ్రువీకరణ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్


ఒంగోలు సెంట్రల్: గిరిజనులు సికిల్ సెల్ (కొడవలి కణాలు) ఎనీమియా వ్యాధి పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డీ సురేష్ అన్నారు. ఒంగోలు గిరిజన్ భవన్‌లో బుధవారం జిల్లా వైద్య, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి పీ జగన్నాథరావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ కొండ ప్రాంతంలో నివసించే గిరిజనులకు సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి వారసత్వంగా సంక్రమిస్తున్నట్లు చెప్పారు. గిరిజనులు సున్నా నుంచి 40 సంవత్సరాల మధ్య ఉన్న వారు విధిగా పరీక్షలు చేయించుకుని వ్యాధిని గుర్తించాలన్నారు. వ్యాధి సోకిన వారికి రక్త కణాలు తగ్గటం, కళ్లు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, అవయవ వైఫల్యం వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించాలని సూచించారు. శరీరంలో తగినంత నీటి శాతాన్ని పాటించాలి, తరచూ నీటికి తాగాలని చెప్పారు. డాక్టర్ సలహా మేరకు తప్పకుండా మందులు వాడాలని కోరారు. సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ జిల్లాలో 1,05,596 మంది ట్రైబల్ జనాభాలో 11 ట్రైబల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 16,372 మందికి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. పరీక్షించిన వారిలో 12 మందికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఉన్నట్లు గుర్తించామని 110 మంది బెస్ట్ క్యారియర్లను గుర్తించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ అధికారి పీ జగన్నాథరావు, డాక్టర్ భగీరథ, ఎన్‌సీడీ నోడల్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, పట్టణ వైద్య అధికారులు డీ శ్రీనివాసులు, మాస్ మీడియా అధికారి సరోజిని, ఉప మాస్ మీడియా అధికారి డీవీ శ్రీనివాసులు, ఆరోగ్య విస్తరణ అధికారులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పొట్టేలు పందేలు


పోటీలో తలపడుతున్న పొట్టేళ్లు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. బుధవారం స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం హనుమంతుని వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని, శ్రీకృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు ఉంటాయని ఆలయ ట్రస్టు బోర్డు ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పొట్టేలు పందేలు నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.25 వేలను బాపట్ల జిల్లా మద్దెబోయిన పాలేనికి చెందిన మద్దెబోయిన రాము, ద్వితీయ బహుమతి రూ.20 వేలను పాతసింగరాయకొండకు చెందిన నక్కా బ్రహ్మేశ్వరరావు, తృతీయ బహుమతి రూ.15 వేలను పర్చూరుకు చెందిన ఉప్పుటూరు శ్రీకృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ సాధించాయి. పోటీల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ మంత్రి సురేష్ పరామర్శ


వైఎస్సార్ సీపీ నాయకుడు రమణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సురేష్

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడి దాడిలో గాయపడ్డ వైఎస్సార్ సీపీ నాయకుడు పాకనాటి రమణారెడ్డిని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. బుధవారం రాత్రి బాధిత వ్యక్తి ఇంటికి వెళ్లి దాడికి గల కారణాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు ఆపకుంటే ఉపేక్షించేది లేదని, తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, రాపూరి ప్రభావతి, షేక్ కరీం, కుమార్, అశోక్, చుక్కా కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసులరెడ్డి, షేక్ సుల్తాన్ తదితరులు ఉన్నారు.